యూడీఏగా వికారాబాద్ జిల్లా

- పాత రూట్‌లోనే రైల్వేలైన్
- పరిగి నియోజకవర్గానికి రూ.100కోట్లు
- ఈ నెల 15న రాడార్ కేంద్రానికి సీఎం శంకుస్థాపన
- నేవీ రాడార్ స్టేషన్‌తో కోల్పోయే చెట్లు 899
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


పరిగిలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి


రిగిలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, అక్టోబర్ 2 : వికారాబాద్ జిల్లాను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూడీఏ)గా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగి నియోజకవర్గాన్ని యూడీ అథారిటీగా ఏర్పాటు చేయాలని తాను సీఎం దృష్టికి తీసుకువెళ్లానని, కాగా జిల్లా అంతటినీ అథారిటీగా చేద్దామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్‌లో చెప్పారన్నారు. ఈ అథారిటీ ఏర్పాటుతో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా కేంద్రం వాటా నిధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా పరిగిలోని గాంధీ విగ్రహానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. అలాగే లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేవీ రాడార్ ప్రాజెక్టు రావడంతో అల్ట్రా మోడల్ హాస్పిటల్ ఏర్పాటు జరుగుతుందని, ఐసీయూకు సంబంధించిన కొన్ని పరీక్షలు అక్కడ చేస్తారని, ఈ ప్రాంతం వారికి అక్కడ అపరేషన్లు చేయించవచ్చని తెలిపారు. ఈ నెల 15న నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కేంద్రం ఏర్పాటులో 899 చెట్లే కోల్పోవడం జరుగుతుందని.. తక్కువ రేడియేషన్‌తో నేవీ రాడార్ స్టేషన్ పనిచేస్తుందన్నారు. 1500 ఎకరాల్లో చెట్లు పెంచే కార్యక్రమం ఉంటుందన్నారు. ఇది ప్రధానమంత్రి కంట్రోల్‌లో ఉండే సీక్రెట్ ప్రాజెక్టు అని తెలిపారు. అనంతరం వారం పది రోజుల తర్వాత అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రూ.800 కోట్లతో నాలుగు లేన్‌ల రహదారి నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేస్తారన్నారు. రూ.3500 కోట్లతో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని. పరిగి, దోమ మండలాల మీదుగా రైల్వేలైన్ వెళ్తుందన్నారు. నారాయణపేట్ ప్రాంతంలో గూడ్స్ రైళ్లు నడపడం ద్వారా వ్యాపారం జోరుగా సాగుతుందన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్క రైల్వే స్టేషన్ తీసివేయబడదని, కొత్తగా చేర్చబడుతుందని చెప్పారు.

రూ.100 కోట్ల కేటాయింపునకు నివేదిక

పరిగి నియోజకవర్గానికి పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీకి సంబంధించి రూ.100 కోట్లు కేటాయించేందుకు సీఎంకు నివేదిక అందజేశామన్నారు. పరిగి మున్సిపాలిటీకి రూ.40 కోట్లు మంజూరు చేయిస్తామని, రూ.5కోట్లతో మున్సిపల్ కార్యాలయం, వార్డు కార్యాలయాలు, కొత్త ట్యాంకులు, వాటర్ కనెక్షన్‌లు, సీసీ రోడ్లు నిర్మాణం చేస్తామన్నారు. పరిగి నియోజకవర్గానికి రీజినల్ రింగ్ రోడ్డు రానుందని తెలిపారు. జిల్లాలోనే మొదట సోలార్ పవర్, విండ్ పవర్ జనరేషన్ ఇక్కడే జరుగుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, మాజీ సర్పంచ్ సిద్ధాంతి పార్థసారథి, వివిధ పార్టీల నాయకులు, కౌన్సిలర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికో డిజిటల్ కార్డు

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పర్యవేక్షక బృందాలకు శిక్షణ

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, అక్టోబర్ 2 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు ఇవ్వాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. అలాగే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అర్బన్ వార్డు, గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా సర్వే బృందాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు నుంచి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పర్యవేక్షక బృందాలకు శిక్షణ ఇచ్చారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి , ఆర్‌డీవో వాసుచంద్ర నాలుగు నియోజక వర్గాల్లోని మున్సిపల్ కమిషనర్లు, మర్పల్లి, యాలాల్, దోమ ఎంపీడీవోలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏర్పాటు చేసిన బృందాలకు శిక్షణ నిర్వహించాలన్నారు. శిక్షణకు ఎంపికైన వారందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ బృందాలు క్షేత్ర స్థాయిలో సర్వేను ప్రారంభించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు డిజిటల్ కార్డుకు సంబంధించి పైలెట్ ప్రాజెక్ట్ కింద వార్డు, గ్రామా పంచాయతీల్లో పూర్తి స్థాయిలో కుటుంబ డిజిటల్ కార్డుకు సంబంధించిన పరిశీలన మొత్తం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఈ అంశాన్ని అదనపు కలెక్టర్లు, ఆర్‌డీవోలు సమన్వయంతో చేయాలన్నారు. ప్రజలు అందుబాటులో ఉండే సమయంలో సర్వేకు వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. కుటుంబ సర్వే అంగన్‌వాడీ టీచర్లకు తెలిసి ఉంటుందని, వారి సహకారం తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యుల ఫొటో మిస్ కాకుండా, డేటాలో పూర్తి వివరాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ప్రత్యేక అధికారి దివ్య పాల్గొని ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఏటీఎం సెంటర్లే టార్గెట్

- జిల్లాలకు అలవాటు పడి దొంగతనాలు
- ఇద్దరు దొంగల అరెస్ట్

ఆదిబట్ల పోలీసుల అదుపులో నిందితులు

ఆదిబట్ల,అక్టోబర్ 2 : ఏటీఎం సెంటర్లే వారి టార్గెట్. రెండు ఏటీఎం సెంటర్లను పగులగొట్టి దొంగతనాలకు పాల్పడి విఫలమయ్యారు. మరో మారు ఏటీఎం సెంటర్లలో దొంగతనాలకు బయలుదేరిన ఇద్దరు దొంగలను ఆదిబట్ల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆదిబట్ల ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. పటాన్‌చెరుకు చెందిన అర్పాజ్ ఖురేషీ, చాంద్రాయణ గుట్టకు చెందిన అజీమ్‌పాషాలు వరుసకు బావ, బామ్మర్దులు. అజీమ్ పాషా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్ గ్రామంలో ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటు జీ వనం సాగిస్తున్నాడు. 15 రోజుల క్రితం వీరిద్దరు కలిసి మేస్త్రీ పని చేశారు. ఈ పనికి వచ్చే డబ్బులు వారి జల్సాలకు సరిపోకపోవడంతో ఏటీఎంలను పగులగొట్టి అందులో ఉన్న డబ్బులను దొంగతనం చేయాలని ప్లాన్ చేశా రు. నాదర్‌గుల్‌లో గత నెల 26న రాత్రి 12 గంటల సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ, ఇండి యా నంబర్ వన్ ఏటీఎం మిషన్లను పగులగొడుతున్న సమయంలో పెద్ద శబ్దం రావడం, అదే సమయంలో అక్కడికి పోలీసు పెట్రోలిం గ్ వాహనాలు రావడం గమనించి పారిపోయారు. ఆ ఏటీఎంల వద్ద సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న కేశంపల్లి రమేశ్‌నాయుడు ఈ విషయమై ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చే శారు. కేసు నమోదు చేసిన ఆదిబట్ల పోలీసు లు విచారణ చేపట్టారు. చుట్టు పక్కల సీసీ కె మెరాలను పరిశీలించారు. బుధవారం ఆదిబట్ల చౌరస్తాలో ఎస్సై రాజు సిబ్బంది ఉపేందర్‌రెడ్డి, శివచంద్ర, రవీందర్, గిరిబాబుతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఇద్దరు బైక్‌పై వెళ్తుండగా వారిని ఆపడంతో పారిపోయేందుకు యత్నించారు. వెంటనే వారిని విచారించగా వారి వద్ద ఉన్న ఓ సంచిలో సుత్తి, సానం, ఇనుపరాడ్ లభించాయి. పోలీసులు గట్టిగా నిలదీయడంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై, సిబ్బందిని మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి అభినందించారు.

నేటి నుంచి దసరా నవరాత్రులు

- జిల్లాలో ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు, మండపాలు
- రోజుకో అవతారంలో దర్శనమివ్వనున్న అమ్మవారు

తుంకిమెట్లలో దుర్గామాత ప్రతిష్టాపనకు ముస్తాబైన మండపం

బొంరాస్‌పేట, అక్టోబర్ 2 : దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయి. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో దుర్గామాతను పూజించి దశమి రోజు దసరా పండుగను జరుపుకొంటారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్, తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల్లోని వివిధ మండలాల్లోని ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాలు, గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం దుర్గామాతను ప్రతిష్ఠించి పూజలు చేయడంతో నవరాత్రులు ప్రారంభమవుతాయి. నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజూ దుర్గామాత అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరిస్తారు. ప్రతిరోజూ వివిధ రకాలైన నైవేద్యాలను అమ్మవారికి సమర్పించి పూజిస్తారు. నవరాత్రుల్లో అమ్మవారు తొమ్మిదిరోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలను దసరా పండుగ రోజు చెరువుల్లో నిమజ్జనం చేసి ఆనందోత్సవాలతో పండుగను జరుపుకొంటారు. నవరాత్రుల సందర్భంగా ఆలయాలు, దుర్గామాత మండపాల ఆవరణల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దాండియా నృత్యాలు, కోలాటం ప్రదర్శనలు, భజనలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. వీటితో పాటు నిత్య పూజలు, కుంకుమార్చన చేపడుతారు. అమ్మవారు ప్రతి రోజూ ఓ అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

జాతిపిత బాటలో పయనిద్దాం

మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 2: జాతిపిత మహాత్మాగాంధీ బాటలో పయనిద్దామని ఎస్పీ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీజీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని, ఆయన అడుగు జాడల్లో నడవాలని సూచించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి,ఆర్ఐ డేవిడ్, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, డీపీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కలకలం

జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో నిందితుడు, స్వాధీనం చేసుకొన్న గంజాయి చాక్లెట్లు, పొడి

- తాండూరులో విక్రయిస్తున్న ఒడిషా ప్రాంతవాసి
- నిందితుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

తాండూరు, అక్టోబర్ 2: తాండూరు ప్రాంతంలో గంజాయి విక్రయాలు కలకలం రేపాయి. పార్కింగ్‌తో పాటు ఇతర స్థలాల్లో గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఈ విషయమై బుధవారం జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. మధ్య నిషేధ, ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలో దాడులు నిర్వహించారు. డిషా రాష్ట్రం పూరీ తాలూకాకు చెందిన నిందితుడు అనిల్ కుమార్ దాస్‌ను అరెస్ట్ చేసి 400 గ్రాముల గంజాయి చాక్లెట్లు, 1.9 కిలో ల ఎండిన గంజాయి పొడిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

నేడు పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 2 : పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నిక గురువారం నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై ఇతర పార్టీల మద్దతుతో హస్తం పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసం ప్రవేశపెట్టి బలపరీక్షలో నెగ్గిన విషయం తెలిసిందే. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఖాళీ అయింది. చైర్మన్ రేసులో పెద్దఅంబర్‌పేట కౌన్సిలర్ పండుగుల జయశ్రీ ఉన్నారు. మెజారిటీ సభ్యులు ఈమెకు మద్దతుగా ఉండటంతో ఎన్నిక లాంఛనమే కానున్నది.

సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలి

సమావేశమైన రజక సంఘం నాయకులు

బషీరాబాద్, అక్టోబర్ 2: సీఎం రేవంత్‌రెడ్డి 2016లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అసెంబ్లీలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక అన్నారు. బుధవారం బషీరాబాద్‌లో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విశిష్ట అతిథిగా ఎక్మాయి ఆశ్రమం శ్రీనివాస్ స్వామీజీ, ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక హాజరై మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యేగా రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో స్పీకర్ మధుసూదనాచారి సమక్షంలో అప్పటి సీఎం కేసీఆర్ హయాంలో 2016 డిసెంబర్ 26న అసెంబ్లీలో రజకులను ఎస్సీ జాబితా లో చేర్చే అంశాన్ని అంసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారని తెలిపారు. నేడు ఆయనే సీఎం హోదాలో ఉన్నారని, తక్షణమే అసెంబ్లీ లో తీర్యానం చేసి కేంద్రానికి పంపితే ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిలా వర్కింగ్ ప్రెసిడింట్ ఆశోక్, జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటయ్య, అనిల్, జగదీశ్, అశప్ప, మహేశ్, నర్సింహులు, మోహన్, ఆశోక్, పకీరప్ప, రాములు పాల్గొన్నారు.

అంబులెన్స్ సిబ్బంది సేవలు అమోఘం

108 సిబ్బందిని సన్మానించిన రంగరాజన్

మొయినాబాద్, అక్టోబర్ 2: అత్యవసర సేవలు అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది సేవలు అమోఘమని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు సీఎస్ రంగరాజన్ అన్నారు. మండల పరిధిలోని ప్రజలు అత్యవసర సేవలు 108 అంబులెన్స్ ద్వారా అందిస్తున్న సిబ్బందిని చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రీ పగలు తేడా లేకుండా నిత్యం సిబ్బంది సేవలు అందిస్తున్నారని చెప్పారు. 108 సేవల ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు సంతోశ్‌కుమార్‌చారి, సలహాదారులు నర్సింహాచారి, సీనియర్ నాయకుడు రవీందర్‌చారి, ప్రచార కార్యదర్శి శ్రీనివాస్‌చారి, నాయకులు కుమ్మరి రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

యూరోప్‌లో గాంధీ జయంతి


గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, అక్టోబర్ 2 : జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం యూరోప్‌లోని అత్యధిక ఎత్తైన ప్రాంతం ఆల్ప్స్ పర్వతాల్లోని జంగ్ ప్రాజోచ్ (స్విట్జర్లాండ్) వద్ద గాంధీ చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ నివాళులర్పించారు. స్పీకర్ ప్రసా ద్ కుమార్ యూరోప్ కు వ్యక్తిగత పర్యటనపై వెళ్లారు.

రంగారెడ్డి కలెక్టరేట్‌లో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్ శశాంక

శాంతి, సామరస్యంతో సమస్యలు పరిష్కారం


మహాత్మాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, తదితరులు

వికారాబాద్, అక్టోబర్ 2 : గాంధీ సూచించిన శాంతి, సామరస్యంతో ఏ సమస్య అయినా పరిష్కరించుకోవచ్చని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గాంధీజీ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులదే కీలకపాత్ర

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, అక్టోబర్ 2: గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులదే కీలకపాత్ర అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఎంపిక చేసిన 750 ఆదర్శ గ్రామ పంచాయతీల్లో కడ్తాల్ ఎంపికైంది. ఈ మేరకు గాంధీ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఎంపీడీవో సుజాత ఆధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే, కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేకాధికారిణి పద్మాకౌశిక్, ఎన్ఐఆర్డీ సలహాదారు తరుణ్‌తివారీ, టీఎస్ఐఆర్డీ అధ్యాపకులు అనిల్‌కుమార్, కన్నయ్య, విద్యుల్లత, డీఎల్‌పీవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదర్శ గ్రామ పంచాయతీగా ఎంపికైనందున పాలక వర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కడ్తాల్ గ్రామ పంచాయతీ జిల్లాకే ఆదర్శంగా నిలిచిందని నాయకులు కొనియాడారు. అనంతరం ఏక్ పేడ్ మా కే నామ్‌లో భాగంగా 75 మొక్కలు నాటారు. అంతకుముందు మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ సిటిజన్స్‌ను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీలు వెంకటేశ్, దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, చెన్నయ్య, వేణుగోపాల్, బీచ్చానాయక్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, లక్ష్మయ్య, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, జంగారెడ్డి, మాజీ వార్డు సభ్యులు భాస్కర్‌రెడ్డి, మల్లప్ప, రవీందర్‌రెడ్డి, లింగప్ప, రమేశ్, నర్సింహ, భిక్షపతి, రామచంద్రయ్య, ఎట్టమ్మ, దీపికారెడ్డి, అశోక్, నరేందర్‌రెడ్డి, అంజుమ్‌బేగం, మహేశ్, జహంగీర్‌బాబా, నాయకులు ఆంజనేయులు, లాయక్‌అలీ, వెంకటయ్యగౌడ్, జహంగీర్‌అలీ, అంజి, యాదయ్య, రాజేందర్‌గౌడ్, రాజేశ్, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్, రాములు, భానుకిరణ్, ఏంపీవో విజయ్‌కుమార్, ఐకేపీ ఏపీఏం రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి పెయింట్

పాఠశాల భవనానికి పెయింట్ వేస్తున్న హెచ్ఎం జంగయ్య

తుర్కయాంజాల్, అక్టోబర్ 2: మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ సుభాష్‌నగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో పలు సమస్యలు తిష్టవేశాయి. పాఠశాల భవనానికి తలుపు లేకపోవడంతో హెచ్ఎం మస్కు జంగయ్య రూ.18వేలు వెచ్చించి వాటిని బిగింప చేశారు. పెయింట్ పూర్తిగా వెలసిపోవడంతో బుధవారం గాంధీ జయంతి రోజు ఆయనే పాఠశాల భవనానికి రంగు వేశారు. ఈ విషయమై వివరణ కోరగా ప్రభుత్వం రూ.25 వేలు విడుదల చేస్తుందని, ఆ నిధులు పరిపోకపోవడంతో సొంతంగా వెచ్చించి చేస్తున్నానని తెలిపారు.

గాంధీ జీవితం ఆదర్శనీయం

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- కలెక్టరేట్‌లో ఘనంగా మహాత్మాగాంధీ 155వ జయంతి వేడుకలు

రంగారెడ్డి, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : గాంధీ జీవితం అందరికీ ఆదర్శనీయమని రంగారెడ్డి కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం మహాత్మాగాంధీ 155వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించగా.. కలెక్టర్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ ముఖ్య పాత్ర పోషించారని, బాపూజీగా, జాతిపితగా గాంధీ నిలిచారని పేర్కొన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమం, స్వదేశీ వస్త్ర ధారణలాంటి అహింసా మార్గాల్లో స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారన్నారు. సత్యం, అహింసా మార్గాలను గాంధీ స్వయంగా ఆచరించి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్ ఘటనపై బాలల హక్కుల కమిషన్ సీరియస్

-సదరు హాస్టల్‌ను సీజ్ చేయాలని కలెక్టర్‌కు సిఫారసు

రంగారెడ్డి, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : మాదాపూర్‌లోని ఓ ఇన్‌స్టిట్యూషన్‌లో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సీరియస్‌గా తీసుకున్నది. పలు దిన పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా స్వీకరిస్తున్నట్లు కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరు ఇన్‌స్టిట్యూషన్‌కు చెందిన హాస్టల్‌ను సీజ్ చేయాలంటూ రంగారెడ్డి కలెక్టర్‌కు బాలల హక్కుల కమిషన్ సిఫారసు చేసింది.

కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు హేయమైన చర్య

మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, అక్టోబర్ 2 : అక్కినేని కుటుంబం (సమంత నాగచైతన్య విడాకుల) విషయంలో మంత్రి కొండా సురేఖ కేటీఆర్‌పై చేసిన తప్పుడు వ్యాఖ్యలను వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బుధవారం తీవ్రంగా ఖండించారు. ఆమె రాజకీయం కోసం దిగజారి తోటి మహిళపై ఇలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటన్నారు. ఇది వాళ్ల దిగజారుడుతనానికి నిదర్శనమని, ఇంతకన్నా హేయమైన చర్య ఇంకోటి లేదని మండిపడ్డారు. దీనికి సమంత సైతం తన విడాకులు పరస్పర అంగీకారంతో జరిగాయి అని వివరణ ఇచ్చారని గుర్తుచేశారు. సంబంధం లేని విషయాల్లోకి కేటీఆర్‌ను లాగటం తప్పుడు పని, ఉన్నత స్థానంలో ఉండి నీచంగా మాట్లాడటం ఏంటి? దీనిపై కొండా సురేఖ అక్కినేని కుటుంబానికి, కేటీఆర్‌కు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.